
# పెళ్ళెప్పుడవుతుంది. బాబూ!

యాళ్ల అచ్యుత రామయ్య



''సిగ్గులేదురా, మగపుట్టుక పుట్టీ – నాకెవ్వరూ పిల్లనివ్వటం లేదని వాపోడానికీ!'' అని మావయ్య కారం బొక్కిన కాకిలా అరవడం ప్రారంభించాడు.

ఏదో సాయం చేస్తాడని ఊరి నుండి మా మేనమామని పిలిపిస్తే – సానుభూతితో నా సమస్యను అర్థం చేసుకోవడం పోయి, నన్నో చేతకాని సన్నాసిని చూసినట్టు చూస్తాడేమిటీ! మావయ్య పెద్దగా చదువుకోకపోయిన ప్పటికీ, మాంచి వ్యవహర్తని ఊరిలో పేరుంది. చిట్టీ వ్యాపారం చేసి బాగానే సంపా దించాడు.

తలుపు చప్పుడు కావడంతో మావయ్య చిరాకుగా మొహం పెట్టి ''ఒరే సత్తిగా, యెవడో తల మాసినెదవ తలుపు బాదేత్తన్నాడు. సూడు!'' అన్నాడు.

నేవెళ్ళి తలుపు తెరవగానే ఎదురుగా బాలూగాడు కనిపించేడు. భల్లూకపు పట్టు టైపులో కౌగిలించుకున్నట్లుగా, బాలుగాడు నన్ను గట్టిగా ఒత్తేసుకుంటూ ''సారీరా, ఈరోజు నీ బర్త్‌డేనట కదా! గుండె దిటవు చేసుకుని బ్రతకాలి మరి!'' అనరిచేడు.

నేను కాస్త సిగ్గుపడుతూ ''పోన్లేరా, ఏం చేస్తాం – వయసయితే ఆగదు కదా!'' అంటూ మెలికలు తిరిగిపోవడం చూసి మావయ్య పరుగున అక్కడికి వచ్చి ''ఒరే సత్తిపండూ, నీకింత వరకూ పెళ్లెందుక్కాలేదో నాకర్థమైపోయిందిరా! నువ్వు శిఖండికి తక్కువా, బృహన్నలకి ఎక్కువా. లేకపోతే ఏంట్రా – ఓ మొగ

పిల్లాడొచ్చి కావలించుకుంటే మెలికలు తిరిగిపోతున్నావ్'' అన్నాడు వెటకారంగా.

దాంతో నేను మరింతగా మెలికలు తిరిగిపోతూ ''కాదు మావయ్యా, ఈరోజుతో నాకు ముప్పయ్యేళ్ళు నిండిపోయాయి.''బాటా'' చెప్పుల రేట్లలా- ఇరవై ఎనిమిదన్నరేళ్ళనీ, ఇరవై తొమ్మిదేళ్ళనీ, ఇరవై తొమ్మిదిన్నరేళ్ళనీ ఇలా చెప్పుకుంటూ ఇంతవరకూ నెట్టుకు వచ్చా!'' అన్నాను గొంతు తగ్గించి.

''ముప్ఫైయేళ్ళు నిండిపోయిన ఈ ముదర మొహాన్ని లోకానికెలా సూపించాలని పీలైపోతన్నావా? యెతికితే నిన్ను మించిన ముదరపిల్ల దొరక్కపోద్దా'' అన్నాడు మావయ్య.

ప్రస్తుత పరిస్థితులు మావయ్యకు తెలియవు. రోజులెలా మారిపోయాయంటే, భర్తృహరి తన సుభాషితాన్ని ఇలా మార్చుకోవాల్సివస్తుంది. 'ప్రయత్నించి ఇసుక నుండి నూనెను తీయవచ్చు. వెంబడించైనా ఎండమావుల్లో నీరు తాగవచ్చు. తిరిగి, తిరిగి కుందేటి కొమ్మునైనా సాధించవచ్చు. కానీ మోసం చేయకుండా ఏ ఆడపిల్లనీ పెళ్ళి చేసుకోవడం మాత్రం సాధ్యం కాదు.'' అని.

నా పరిస్థితిని చూసి బాలుగాడు నా తరపున వకాల్తా పుచ్చుకున్నవాడిలా ''ఇవ్వాళా, రేపూ ఆడపిల్లలే ముప్ఫై ఏళ్ళు వచ్చినా పెళ్లి చేసుకోవడం లేదు'' అంటూ ఏదో చెప్పబోతూ ఉంటే, మావయ్య మధ్యలోనే కల్పించుకున్నాడు.

''నోర్ముయ్యండరా, సేతకాని దద్దమ్మల్లారా! 'నాకే కాదూ, మా హెడ్మాట్టారి కొడుక్కూడా సున్నొచ్చింది' అన్నట్టుగా ఆడపిల్లెందుకురా మీ గాటని కట్టెత్తారూ!'' అంటూ మావయ్య బాలుగాడి వంక చూస్తూ, ''ఈడిమొగం ఇప్పటికే నిప్పుల మీద కాల్చిన వొంకాయలా - నల్లగా మాడిపోయింది. ఈడొయిసెంతటా?'' అన్నాడు.

నేను కాస్త గర్వంగా '' ఆ.. ఏవుందీ, నాకంటే ఓ అయిదేళ్ళు ముందు పుట్టేడంతే.'' అన్నాను.

''నువ్వే ముదురంటే, ఈడు ఈర ముదురన్న మాట!''

నేను కాస్త నవ్వాపుకుంటూ ''మాలో మహా ముదురొకడున్నాడు. వాడికి ముప్ఫై ఎనిమిదేళ్ళు!'' అన్నానో లేదో మావయ్య అసెంబ్లీలో ప్రజాప్రతినిధిలా తిట్లు లంకించుకున్నాడు. ''నీ మొకానికి యెటకారాలు కూడానా! ఛీ.. మీ బతుకులు సెడా.. నీ స్నేహితులంతా ఇలా తలమాసిన యెదవలేనా? శుభ్రంగా సరైన వొయిసులో పెళ్ళీ పెటాకులూ అయినోడు ఒక్కడు కూడా లేడా?''

''నాక్కొంచెం అర్జెంటుగా పనుందిరా. మళ్ళీ కలుస్తా.'' అంటూ బాలుగాడు బయటకు పరిగెత్తబోయి, వీధి గడపను తన్నుకుని బొక్కబోర్లా పడ్డాడు.

బాలుగాడు వెళ్ళిపోయిన వెంటనే నేను ఇటు వైపు తిరిగి ''ఏంటి మావయ్యా, నా ఫ్రెండు ముందు నన్నింతగా అవమానించావ్? ఈరోజుల్లో మగపిల్లాడికి పెళ్ళికావడం ఎంత కష్టమో పల్లెటూరులో ఉంటున్న నీకేం తెలుసూ? మీ కాలంలో అయితే ఏదోరకంగా ఓ ఆడపిల్లని మాయ చేసేసి, పెళ్లి చేసేసుకునేటోళ్ళు. ఇప్పుడు మా పాట్లు అన్నీ ఇన్నీ కావు. అవును మావయ్యా ఏం కొంపలు మునిగిపోయాయని నీవు ముగ్గురు పిల్లలతో ఆపేసావ్? నువ్వింకో పిల్లని కని ఉంటే, నేను చేసుకునేవాణ్ణి కదా! ఇప్పుడు మాత్రం ఏమైందీ కొంచెం గట్టిగా ట్రయి చేయకూడదూ?'' అన్నాను.

మావయ్య నా వంక అదోలా చూసి ''నేనిప్పుడు మరోపిల్లని కంటే, నువ్వు పెళ్లీ, షష్టిపూర్తీ ఒక్కసారే సేసుకోవచ్చనా?'' అన్నాడు.

అంతలో 'మ్యాం' గాడు రావడంతో నాకెంతో సంతోషమైంది. మొదటినుండీ వాడు పిల్లిగెడ్డం పెంచడంతో అందరూ వాణ్ణి 'మ్యాంగాడు' అనడం మొదలుపెట్టేరు. వాడసలు పేరు ఏమిటో చాలా మందికి తెలియదు.

మావయ్య వాడివంక వింతగా చూసి, నావైపు తిరిగి ''ఇందాకా నువ్వు సెప్పిన దేశముదురు ఈడేనా?'' అన్నాడు.

వెంటనే నేను నాలుక్కరుచుకుని ''వాడా..మహా ముదురు గాడా! వాణ్ణి సాయంకాలం పరిచయం

''ఏంటి మావయ్యా, ఈరోజుల్లో మగపిల్లాడికి పెళ్ళికావడం ఎంత కష్టమో పల్లెటూరులో ఉంటున్న నీకేం తెలుసూ? మీ కాలంలో అయితే ఏదోరకంగా ఓ ఆడ పిల్లని మాయ చేసేసి, పెళ్లి చేసేసుకునే టోళ్ళు. ఇప్పుడు మా పాట్లు అన్నీ ఇన్నీ కావు. అవును మావయ్యా ఏం కొంపలు మునిగిపోయాయని నీవు ముగ్గురు పిల్లలతో ఆపేసావ్? నువ్వింకో పిల్లని కని ఉంటే, నేను చేసుకునేవాణ్ణి కదా!''

చేస్తానులే. మావయ్యా, మా ఫ్రెండ్సంటే నీకు మహా వెటకారంగా ఉంది కానీ, వీణ్ణి చూడూ ఓ పిల్లని ఎలాగో ఓలాగా బుట్టలో వేసి, పోయిన నెల్లోనే పెళ్లి చేసేసుకున్నాడు.'' అన్నాను కాస్త గర్వంగా.

''ఏమిటీ.. ఈడికీ మధ్యనే పెళ్లయిందా? ఈడి మొహంలో చావు కళ తప్ప, కొత్త పెళ్ళికొడుకు కళ ఏమీ కనిపించడం లేదే!'' అన్నాడు మావయ్య వాడి వంక ఎగాదిగా చూస్తూ.

మా మ్యాంగాడు ఏమన్నా తక్కువతిన్నాడా - ''ఆయనెవడ్రా, టివి యాంకర్‌లా చాలా ఎక్కువ చేస్తున్నాడు.'' అన్నాడు.

వాడి ధైర్యానికి నేను మనస్సులోనే సంతోషపడుతూ ''ఈయన మా మావయ్యరా! ఓ ముఖ్యమైన పనిమీద ఇక్కడికి వచ్చేడు'' అంటూ పరిచయం చేసాను.

మావయ్యకి ఓ దొంగనమస్కారం పడేసి, వాడు నావైపు తిరిగి ''నీవన్నీ మా మావయ్య పోలికలన్న మాట!'' అన్నాడు.

మావయ్య ఊరుకోవచ్చు కదా! ''ముదురు బ్రహ్మచర్యంలో తప్పా!'' అని మ్యాంగాడి వైపు తిరిగి ''అది సరేకానీ.. పెళ్ళయిన కొత్తల్లో దోర జాంపండులా నిగనిగలాడుతూ ఉండాలి గానీ, మూల సెంక పేసెంటులా తెల్లగా పాలిపోయావేంటయ్యా?'' అంటూ కూపీ లాగడానికి ప్రయత్నించాడు.

మ్యాంగాడు కుర్చీలో కూలబడి ''ఏం చెప్పమంటారు సార్ - మా ఆవిడ డ్రాకులా మల్లే రోజూ రాత్రిళ్ళు నా రక్తం పీల్చేస్తోంది. మీకు బాగా అర్థం కావాలంటే 'గుండ్రాలు' తిప్పాలి సార్..'' అంటూ కళ్ళు మూసుకున్నాడు.

మావయ్య నావైపు తిరిగి ''నీ స్నేహితులందరికీ ఎంతో కొంత పిచ్చి ఉన్నట్టుందొరేయ్. 'గుండ్రాలు' ఏమాట్రా బాబూ!'' అన్నాడు, చిరాగ్గా ముఖం పెట్టి.

మ్యాంగాడు సోది మళ్ళీ మొదలెట్టేడు. ''సిన్మాల్లో ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్ళేటప్పుడు గుండ్రాలు.. గుండ్రాలు..తిప్పుతారు చూడండి, ముఖం మీద అదన్నమాట. అప్పటికి నేనింకా పెళ్లికాని బ్రహ్మచారినండి. మా ఫ్రెండ్సు నన్నెవరికైనా పరిచయంచేసేటప్పుడు 'మాంచి ఫేమిలీ టైపు కుర్రాణ్ణని చెప్పేవాళ్లు....''

''అంటే..ప్రస్తుతం నీవు పెళ్ళయిన బ్రెమ్మసారివా? ఫామిలీ టైపేంటయ్యా బాబూ.. ఇదేదో పెద్దాపురంలో ఇనిపించే మాటలా ఉంది...'' అంటూ మావయ్య, అష్టావధానంలో అప్రస్తుత ప్రసంగిలా అడ్డు తగిలాడు.

''సార్..మీరిలా ట్రాఫిక్ పోలీసులా అయిన దానికీ కాని దానికీ చెయ్యి అడ్డం పెట్టేస్తుంటే..నా ఆలోచన్ల 'ఫ్లో' ఆగిపోతుంది. ఎంతవరకూ చెప్పేనూ. ఆc..నేను మెడికల్ రిప్రజంటేటివ్‌గా పని చేస్తున్నాను కాబట్టి, తోలుబ్యాగొకటి వేసుకొని, ఆసుపత్రులన్నీ తిరుగుతూ ఉండేవాణ్ణండి. 'మెడి-కిల్ ఆస్పిటల్లో మెడికల్‌లాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ఈ డ్రాకులాను చూసి, ఓ బలహీన క్షణంలో 'మనసంతా నువ్వే, ఒళ్ళంతా కొవ్వే' అంటూ పాటపాడేసి, ఆమె వెంట పడ్డానండీ...''

టీవీ సీరియల్లో ప్రేమసన్నివేశం మంచి ముదురు పాకాన పడుతూ ఉండగా, మధ్యలో దోమల చాపల గురించి ప్రకటనలా...మావయ్య అడ్డుతగిలాడు. ''గంతకు తగ్గ బొంత అన్నట్లుగా, ఇద్దరివీ రోగిష్టి ఉజ్జోగాలే కదా... అదే రోగిష్టోళ్ళ సుట్టూ తిరిగే ఉజ్జోగాలే కదా... మూడు సూదులూ, ఆరుగోళీల్లా మీ ప్రేమ తిరగబెట్టిందా?''

''నేను కూడా అలానే అనుకునే దాన్లో కాలేసాను సార్! పెళ్లయిన వెంటనే నాకు తిప్పలు ప్రారంభమయ్యాయండి. శోభనం గదిలోకి పాలగ్లాసుతో రావాల్సిన పెళ్లాం సిరంజితో వచ్చిందండి..''

మావయ్య ఆత్రుతని ఆపుకోలేక ''మీ ఆవిడ సిరంజీవి అభిమానా? ఎంత అభిమానం ఉంటే మాత్రం శోభనం గదిలోకి పరాయి మొగోణ్ణేసుకుని వచ్చేయడవేం?!?'' అంటూ ఆశ్చర్యపోయాడు.

''అబ్బా.. చిరంజీవి కాదండి బాబూ..సిరంజి. సూదీ, సిరంజి పట్టుకుని వచ్చి కీలుగుర్రం సిన్మాలో అంజలీదేవి రూపంలో వచ్చిన బ్రహ్మరాక్షసిలా ''రక్తం...రక్తం'' అందండి. అప్పటికప్పుడు నా రక్తం తీసుకుని, ''ఇందులో హెచ్. ఐ. వి వైరస్ లేదని తేలితేనే, ఈ రాత్రికి నీతో కాపురం చేస్తా?'' అని చెప్పి, గిద్దెడు రక్తం గుంజుకుని పోయిందండి. ప్రక్కగదిలో పరీక్ష చేసుకుని వచ్చి, స్పిరిట్ వాసన కొట్టుకుంటూ వచ్చి పక్కలో పడుకుందండి. మర్నాడు కూడా




మళ్ళీ సిరంజితో తయారైపోయిందండి. ''రోజూ అవసరం లేదేమో!'' అన్నానండి. 'లాబ్ టెక్నీషియన్ని నాకా మాత్రం తెల్వదా? తెల్లారిలేస్తే రోడ్డట్టుకుని తిరిగే ఉజ్యోగం నీది. ఏరోజైనా, ఏ బలహీన క్షణంలోనైనా లెగ్ స్లిప్ అయ్యే అవకాశం ఉంది. ఎయిడ్స్‌కి మందులేదు. నివారణ ఒక్కటే మార్గం. తొడుగు పడుతుంది నీకు గొడుగు.. టింట డోంయ్..'' అంటూ బుర్ర వేడెక్కించేసిందండి. ఆ రకంగా.. రోజుకో గిద్దెడు రక్తం పీల్చుకుని పోతుంటే నేనెలా నవనవలాడుతూ ఉంటాను చెప్పండి సార్!''

వాడి జాలి గాథ విని మావయ్య ఓదార్పు మాటలేమైనా చెబుతాడనుకుంటే ''నీ బాధేమిటో నాకిప్పుడు అర్థమయ్యిందయ్యా! నీ జీతమంతా ఆ రక్తపరీక్షల బిల్లులు కట్టడానికే సరిపోయిందన్న మాట!'' అన్నాడు.

ఓ ఫ్రెండుగా వాడి సమస్యకు పరిష్కారమార్గం చూపించాలనుకుని ''నీ ఎయిడ్స్ టెస్టుల ఖర్చును భరించడానికి పార్ట్‌టైం ఉద్యోగం కోసం ఏదైనా నెట్‌వర్క్ బిజినెస్‌లో చేరకపోయావా?'' అన్నాను.

వెంటనే మ్యాంగాడు రెండు చేతులూ జోడించి ''ఆహా! మేనమావా, మేనల్లుడూ నా సమస్యని ఎంత చక్కగా అర్థం చేసుకున్నరో! నిశ్శబ్దాన్ని ఛేదించండి. ఎయిడ్స్‌గురించి చర్చించండి'' అంటూ వెర్రి చూపులు చూసుకుంటూ బయటికి పరుగు తీసాడు.

***

'అవున్రాసత్తిగా.. ఇంతకీ నీక్కాబోయే భార్య ఎలా ఉండాలి?'' అంటూ ఉదయాన్నే మావయ్య నా జీవన్మరణ సమస్యను లేవనెత్తేడు.

రోడ్డు మీద ముష్టెత్తుకునే వాడి దగ్గర కెళ్ళి, నీకెలాంటి కారు కావాలన్నట్లు ఉందీ ప్రశ్న! '' ఎందుకులే మావయ్యా, జరగని వాటి గురించి ఆలోచించుకోవడమెందుకు!'' అన్నాను పెద్ద వేదాంతిలా.

''నోర్మూయ్యవోయ్...'' అని నాలుక్కరచుకుని, చెంపలు రెండూ వాయించుకుని ''పోయి, పోయి మీ అయ్య నీకు అన్నోరం సత్‌నారాయణ సోమి పేరెట్టేసేడు, తిట్టాలంటే భయవేత్తంది. ఆ తింగర సేష్టలు మానేసి..నేనడిగిందానికి స్టేట్‌గా జవాబు సెప్పెహే'' అన్నాడు.

నేను కాస్త సిగ్గుపడుతూనే ''ఐశ్వర్యారాయ్‌లా ఉంటే చాలు, ఏదో అడ్జస్టయిపోతాను'' అన్నాను.

''ఆఁ..కల్నానా రాయీ, సన్నికల్లురాయీ, ఊరి చివరి సాకిరేవులోని బండరాయీ... ఒద్దూ!'' అంటూ మావయ్య దీర్ఘాలు తీసాడు. తూ.గో.జిల్లాలో ఎంత పల్లెటూరి మొద్దుకైనా సినిమా పరిజ్ఞానం బానే ఉంటుంది.

''ఐశ్వర్యారాయిలా ఉన్నపిల్ల ఏ ఉత్తుత్తిరోసన్నో సేసుకుంటంది కానీ, పొట్లకాయకి సొక్కా, లాగూ తగిలించినట్టుండే నిన్ను ఎందుకు సేసుకుంటాదిరా?''

కాస్త ఊపిరి బిగపట్టి, ఛాతీని సాధ్యమైనంతగా పొంగించి ''ఏం నేను ఇంచుమించు హృతిక్‌రోషన్‌కి సరిసమానంగా లేనా?'' అన్నాను.

''ఒరే..అంటే అన్నానంటావు కానీ..నిన్ను నీవెప్పుడైనా అద్దంలో సూసుకున్నావురా! నిన్ను తిరిగి పోగుపెడితే పావుకిలో మాంసం కూడా తూగదు. జుట్టు మూడు వయిపులూ కొట్టేయడంతో నీ తలకాయ దీపకల్పంలా మారిపోయి, తాబేటికాయలా మెరుత్తుంది. అవున్రా..సిటీలో ఉంటన్నావ్.. ఆ తలకాయకింత ఏవైనా సేయిలేకపోయేవా? మనూళ్లో పాటోరి బుల్లబ్బాయిగారి ఆకరోడు లేడూ..అదేరా నర్సిగాడు ఆడంగోడిలా నడుత్తాడు సూడు ఆడికి సిన్నప్పట్నిచీ బట్ట బుర్రే. ఎంట్రుకులతికించిన టోపీ తగిలించి ఊర్లోకి దిగితే ఇక సూడూ..నాగార్జున బాబులా ఉన్నాడురా..''

నాకు ఒళ్లు మండింది. ''విగ్గుతో చూసినప్పుడు నాగార్జునా! మరి ఆ నర్సిగాడి నడకో..'' అన్నాను వంకరగా నవ్వుతూ.

''సర్లేవో.... ఆడంగి నడక నడిసినా, ఆడూ ఓ పిల్లని బరిలోకి దించి, పెళ్లాడేసేడు. నువ్వా ఉన్నావు.. ముప్పయేళ్ళు ముడ్డికిందకి వచ్చినా, సీమకుట్టినట్టు కూడా లేదు నీకు.''

అబ్బా.. 'ఈక్' పోయింటు మీద కొట్టేసేడండి బావూ..అని మనసులోనే అనుకుని ''విగ్గు పెట్టుకుని పెళ్లిచూపులకెడితే, ఆ పిల్లని మోసం చేసినట్లే కదా!'' అన్నాను.

''అబ్బా...పెద్ద సచ్చరిచ్చంద్రుడొచ్చేసేడండీ! సిన్మాయాత్రలందరికీ గుండె వుండేది. ఆళ్ళ విగ్గో బొగ్గో పెట్టేసుకుని డేంచులు సేసెత్తంటే సూట్టంలేదూ.. ఓపాలి తాలి కట్టేసేక, ఏ ఆడదానికైనా మొగిడి మొకవంక తిరిగి సూడాలనిపిత్తదా? నే సెప్పాల్సింది సెప్పేను, తర్వాత నీ ఇట్టం. నీవిలా జీవితాంతం సత్రం భోజనం, మఠం నిద్రలా, గడిపేయాలని నీ నొసట రాసుంటే, నేనేం సేయగల్ను. నేనీరోజే మనూరి బస్సెక్కెత్తా.'' అని భయపెట్టేడు.

''వద్దులే మావయ్యా. నేను విగ్ కొనుక్కుంటాలే. మొన్నామధ్య మా ఏబ్రాసి సభ్యుడొకడు విగ్ పెట్టుకుంటే, బాగానే ఉన్నాడు.''

''ఎంట్రోయ్, నీలాంటి ఏబ్రాసోళ్లందరికీ ఓ సంఘం కూడా వుందా?''

''అబ్బే.. ' ఏబ్రస' అంటే ఏజ్ బారైన బ్రహ్మచారుల సమాజం.' దీంట్లోని సభ్యులంతా ప్రతి శనివారం సాయంకాలం నెక్‌లెస్‌రోడ్డు దగ్గర కలుస్తాం.

***

రేపు ఆదివారం, శెలవు రోజనే సంతోషం అక్కడికి చేరిన జనంలో బాగా కనిపిస్తోంది. అప్పటికే చేరిన జంటలు మమ్మల్ని వెక్కిరిస్తున్నట్లుగా ఉన్నాయి.

''ఎంట్రోయ్ సత్తిగా, టోటల్‌గా గెటప్పే మార్చేసావ్? విగ్గు పెట్టేవ్. ఏదైనా నాటకాల కంపెనీలో చేరావా, ఏం ఖర్మ!'' అని రామకృష్ణగాడు అరిచేడు.

మిగిలిన మిత్రులు కూడా నావంక వింతగానూ, వెటకారంగానూ చూస్తుంటే, నాక్కాస్త సిగ్గుతో మొహం ఎర్రబడింది. ''ఏవుందిరా..గిరాకీ ఏం రావడం లేదని పోస్టర్ మార్చాలనుకున్నా. అందుకే ఇలా..'' అన్నాను.

వెంటనే సుధీర్‌గాడు లేచి ''నాక్కూడా బొమ్మ అచ్చిరాలేదురా. అరుణా స్టూడియో కెళ్ళి బొమ్మ మార్చేయాలనుకుంటున్నా. అవున్రా.. రామసుబ్బిగా.. ఈమధ్య నీవు చాలా హేపీగా కనిపిస్తన్నవ్, కొంపతీసి నీకు పెళ్ళి కుదిరిందా?'' అన్నాడు.

''ఆఁ.. ఏముందీ! ఆమధ్య నేనొక అమ్మాయిని చూసొచ్చాను చూడూ! అంతా ఒకే అనుకున్నా మొన్ననే మా అన్నయ్య ఫోన్ చేసి చెప్పేడు, ఆ పిల్ల ఎవడితోనో లేచిపోయిందట..!''

''కాబోయే పెళ్ళాం లేచిపోతే బాధపడాలికానీ, హేపీగా ఉండడానికేముందిరా, ఇందులో'' అన్నాను అయోమయంగా.

''ఈ లేచిపోయే కార్యక్రమం కొంచెం లేటుగా చేసిందంటే, 'రామ సుబ్బిగాడి పెళ్లాం లేచిపోయిందోచ్' అంటూ మీరందరూ పార్టీల మీద పార్టీలు చేసేసుకునేటోళ్ళు కారూ!'' అన్నాడు.

ఆమాటలకు అందరూ హాయిగా నవ్వుకున్నాం.

చీకటిపడేకొద్దీ దొంగప్రేమికుల సందడి ఎక్కువవుతోంది.

లేటుగా వచ్చిన రవీంద్ర ''అవున్రా సత్తిగా.. మావంటే తుమ్మితే ఊడిపోయే ఉద్యోగాలే అనుకో. నీది గవర్నమెంటు జాబే కదా! నీకైనా మంచి సంబంధాలు రావాలి కదా!'' అన్నాడు ఆశ్చర్యంగా.

నేను సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్లుగా ''నా బాధ ఎవరికి అర్థమవుతుందిరా? 'గవర్నమెంటు జాబ్ సరే, జీతం ఎంతటా?' అనడుగుతున్నారు. ఏడువేలనగానే, 'రేపొద్దున పిల్లలు పుడితే వాళ్ళ

ముడ్డికి కట్టే గుడ్డలక్కూడా ఈ ముష్టి ఏడువేలూ సరిపోవు. ఏ నలభై వేలో, ఏభైవేలో ఉంటుందను కుంటున్నాం.' అంటూ ముక్కిరుస్తారు. ఈ సాఫ్ట్‌వేర్ కంపెనీలొచ్చాకా, మనలాంటి 'ఫామిలీ టైప్' జీతగా ళ్ళంటే మరీ వెటకారమ్మైపోయింది. కొంతమందైతే, 'పైన' ఏమైనా వస్తుందాని సిగ్గిడిచి మరీ అడుగు తారు. పైనా రాదూ, కిందా రాదని మనం బయటికి పరిగెత్తుకుని వచ్చేస్తాం. గవర్నమెంటు ఉద్యోగాల్లో కూడా కమర్షియల్ టాక్స్ ఆఫీసరు లాంటి ఉద్యోగు లకయితే డిమాండ్ బాగానే ఉంది.'' అన్నాను.

పిల్లి కళ్ళ సుందర్‌గాడయితే ఏడవడం ఒక్కటే తరువాయి. ''ఎబ్రాడ్‌లో ఉద్యోగం చేస్తున్న వాళ్ళే మగాళ్ళయినట్లు బ్లడీ ఇండియా సంబంధాలొద్దని మ్యారేజీ బ్యూరోవాళ్ళకి చేప్పేస్తున్నారట! ఏ అమెరి కాలోనో, దుబాయిలోనో రెండో మూడో పెళ్ళిళ్లు చేసేసుకుని, ఇక్కడి పిల్లని తీసెకెళ్ళి వాళ్ళకి సవితిగా ఉంచినా పర్వాలేదన్న మాట!'' అన్నాడు ఉక్రో షంగా.

బదులుగా శేఖర్ ''సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో కూడా ఏ సత్యంనో, విప్రోనో అయితేనే డిమాండ్ నాలా ఏ చిన్నా, చితకా సాఫ్ట్‌వేర్ కంపెనీలైతే ఉద్యోగానికి సెక్యూరిటీ లేదని పిల్లనివ్వడం లేదు.'' అంటూ తన గోడు వెళ్ళబుచ్చుకున్నాడు.

సుధీర్ సీరియస్‌గా ''ఇప్పటికి ఎన్నో ఫోటోలు చూసానా, ఒక్క అమ్మాయి కూడా 'పర్లేదు' అనే ట్టుగా లేదురా?'' అన్నాడు.

రామకృష్ణగాడొచ్చి గీతోపదేశం చేస్తున్నట్లుగా పోజు పెట్టి ''భక్తా.. అన్నీ చక్కగా వున్న అమ్మాయి లకి ఇరవై, ఇరవై రెండేళ్ళకే పెళ్ళిళ్లు అయిపోతాయి. ఎక్కడా చెల్లని నాణేలే మనలాంటి ముదురు కేసు లకి ఎదురవుతుంటాయి.'' అన్నాడు.

సుధీర్ తన అనుభవాన్ని వివరిస్తూ ''మా అమ్మ, నాన్న, నేనూ కలిసి ఓ అమ్మాయిని చూట్టానికి వేళ్ళేం. వాళ్ళు చెప్పినట్లే ఉదయం పదకొండు గంట లకు వెళ్లాం. ఎంతసేపైనా అమ్మాయి రాదే! అదే మని గట్టిగా అడిగితే – 'ఎంతలేపినా అమ్మాయి లేవడం లేదండీ. రాత్రి డ్యూటీ చేసి లేట్‌గా వచ్చిందని చెప్పేరు. ఏదో చిన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా చేస్తోందట. వెంటనే మా అమ్మలేచి 'ఇలా రాత్రిళ్ళు ఎక్కడెక్కడో తిరిగొచ్చే పిల్ల – మొగుడుతో కాపురం ఏం చేస్తుందిరా?' అంటూ నన్ను జబ్బ పుచ్చుకుని బయటికి లాక్కొ చ్చింది.'' అన్నాడు.

నాకు సడన్‌గా గుర్తుకు రావడంతో రామకృష్ణ వైపు తిరిగి ''ఒరేయ్, మొన్న నీవొక సంబంధం చూట్టానికి వెళ్ళేవు కదా, ఎమ్మైందీ?'' అన్నాను.


రామకృష్ణ ఏడ్వలేక నవ్వుతున్నట్లు మొహం పెట్టి 'ఈరోజుల్లో అమ్మాయిలు దేనికీ కాంప్రమైజ్ కావడం లేదురా బాబూ! మొన్న నేను వెళ్ళినచోట, అమ్మాయి తల్లిదండ్రులకంటే ఎక్కువ ఆ అమ్మాయే మాట్లాడేస్తోంది. తలకాయ దించుకోవడం నా వంతయింది. కొసమెరుపు ఏమిటంటే – పర్సన ల్‌గా మాట్లాడాలని చెప్పి మేడమీది గదిలోకి తీసికె ళ్లింది. అసలే రోజులు బాగాలేవు. ఒంటరిగా మగపి ల్లాడు ఓ ఆడపిల్ల వెంట వెళ్ళడం ఎంత ప్రమాదం! అయినా మన జాగ్రత్తలో మనం ఉండాలని మా అమ్మని తోడు రమ్మన్నాను. 'నిన్నేం రేప్ చేయను కానీ, రావోయ్!' అంటూ నన్ను లాక్కెళ్ళింది. 'నీ హేబిట్సు సంగతేంటీ?' అంది 'అమ్మతోడు నాకు వక్కపొడి కూడా అలవాటు లేదు.' అన్నాను. 'కానీ నాకు అప్పుడప్పుడు జిన్ కొట్టే అలవాటుంది, ఏం చేద్దాం'' అనగానే, నేను పరుగో పరుగు...'' అన్నాడు.

అంతలో శేఖర్ అందుకొని ''నాకూ ఇలాంటి అనుభవమే కలిగింది. పెళ్ళి చూపులు అయ్యాక అమ్మాయి నాతో పర్సనల్‌గా మాట్లాడాలని చెప్పి ఏమందో తెలుసా! 'నేనింతకుమునుపే ఒకతనిని లవ్వు చేశాను. నాకిప్పుడు మూడోనెల. మా పేరెంట్స్‌కు చెప్పే ధైర్యం లేక ఊరుకున్నాను. మీకీ సంబంధం నచ్చలేదని చెప్పండి.' అంటూ బ్రతిమా లింది.'' అన్నాడు.

సుధీర్ మధ్యలో కల్పించుకుంటూ ''అరె! ఆ అమ్మాయినే చేసుకోవల్సిందిరా కలిసొచ్చే కాలంలో నడిచొచ్చే పిల్లలు పుడతారన్న సామెత నీ విష యంలో నిజమయ్యేది.'' అన్నాడు,.

శేఖర్ వెంటనే లేచి సుధీర్ నెత్తి మీద మొట్టికాయ

## ముంబయ్ తెగ నచ్చింది



బొద్దుగా ముద్దుగా కనిపించే ఈ బెంగాలి ముద్దు గుమ్మ ఇప్పుడు బాలీవుడ్ వెండి తెరపై కనిపించాలని పడరాని పాట్లే పడు తోంది. ఈ సుందరి పేరు నేహా మార్ధా. కోల్‌కటా నుంచి టీవీ సీరియ ళ్లలో నటించేందుకు ముంబయ్‌కి వచ్చే యడం, ఆ తరు వాత ముంబయ్ తెగ నచ్చేయడంతో కోల్‌కటాకు నమస్తే పెట్టేసింది. ముంబయ్ గురించి నేను ఎన్ని చెప్పినా తక్కువే అని చెప్పే స్తోంది. సినిమాలు బాగా చూడ్డం, హారీ పోట్టర్ అన్ని సంపు టాలూ తెగ తీరిగ్గా చదివేసిన ఈ పంధొ మ్మిదేళ్ళ సుందరీ మణి ఎలాగైనా వెండితెర మీద కని పించాలని ఉవ్విళ్లూ రుతోంది. ఎక్స్‌పో జింగ్ అంటే పెద్దగా పట్టింపులేదని కూడా చెప్పే నేహా మార్ధా.. అప్పుడే బి.ఆర్.చోప్రా సిని మాలో బుక్ అయిందిట. ఇక రాజశ్రీ ప్రొడక్షన్స్ వాళ్లు కూడా కాంటాక్ట్‌లో వున్నా రని చెబుతోంది మార్ధా. ఏదేమైతే నేం నేహా మార్ధా తన కోరిక తీర్చుకో బోతోంది.

వేశాడు.

ఇంతలో ఓ పోలీసు వచ్చి ''అర్ధరాత్రవుతుంది పోండెహె ఇంటికి'' అని అరిచాడు. సాగర్ నీటిపై నుండి ఓ చల్లని... పరమ అసహ్యకరమైన కంపు వచ్చి ముక్కులకు తాకడంతో, మేం హైద్రాబాద్‌లో ఉన్నామని గుర్తుకు వచ్చి ఇంటి ముఖం పట్టేం.

***

ఎలా అయితేనేం మా మావయ్య తన లౌక్యాన్నంతా ఉపయోగించి నాకో సంబంధాన్ని ఖాయం చేయగలిగేడు. ఓ మ్యారేజ్ బ్యూరో దగ్గర ఓ అమ్మాయి వివరాలు ముందుగానే తెలుసుకుని దానికి తగ్గట్లుగా నా జాతక చక్రాన్ని మార్చి రాయించేడు. దాని ప్రకారం నా వయసు ఇరవైనాలుగు మాత్రమే! మా ఫ్రెండ్సుని పెళ్లికి పిలుస్తానంటే 'ఆ కోతి మూక వచ్చిందంటే అందులో ఏ టింగర నాకొడుకో అసలు సంగతి బయట పెట్టేడంటే, పందిట్లోనే పెళ్లాగిపోద్ది..' అని మావయ్య భయపెట్టేసేడు.

పెళ్లి యాదగిరిగుట్టలో చేసుకోడానికి నిర్ణయించుకోవడం వల్ల హైదరాబాదులో ఉన్న నా మిత్రవానరాలకి అనుమానం రాకుండా మేనేజ్ చేయగలిగాం.

ఊళ్ళో ఉన్న మరీ దగ్గర బంధువులను డైరక్టుగా యాదగిరిగుట్ట వచ్చేయమని చెప్పాం. జైలు నుండి తప్పించుకున్న దొంగల్లా నేనూ, మావయ్యా మొహాల్నిండుగా కంబళి కప్పేసుకుని, బస్సులో కూర్చున్నాం.

***

ముహూర్త సమయం దగ్గ పడుతున్న కొద్దీ నాకు కాళ్ళూ చేతులూ వణుకుతున్నాయి. తాళికట్టే ముందు ఆఖరిసారిగా ఆమె మొహాన్ని ఒక్కసారి చూసాను. ఐశ్వర్యారాయిలా ఉంటే తప్ప చేసుకోనన్న వాణ్ణల్లా, ఆడదై ఉంటే చాలు అనేంత వరకూ వచ్చాను. ఏం చేస్తాం. పరిస్థితుల ప్రభావం!

తాళి కట్టడానికి నేనిలా లేచానో లేదో 'ఆపండి' అన్న అరుపు వినినిపించింది. అచ్చం సిన్మాల్లో ఇదేం ఏంటీ క్లయిమాక్స్‌రా బాబూ అని భయంతో బిగుసుకుపోయాను. ఇలాంటి మొద్దు కాచ్చి ప్పలను ప్రేమించే అభాగ్యజీవులు కూడా ఉంటారా అని! నడుం పైకెత్తి చూసా.. ఇంకేముంది మా వానరమూకంతా అక్కడ చేరడంతో ఆ ప్రాంగణమంతా కిష్కింధాపట్నంలా తయారైంది. వీళ్ళకీ రహస్యం ఎలా తెలిసిందాని ఓ ప్రక్క నేనాశ్చర్యం నుండి తేరుకోకముందే..

''మాకు మాట మట్టుకైనా చెప్పకుండా, ఇలా దొంగ పెళ్లి చేసుకుంటావా? ఈ పెళ్లి ఎలా జరుగుతుందో మేం చూస్తాం?'' అంటూ బాలుగాడు నా చేతిలోని తాళి లాక్కుని పారిపోయాడు.

అంతలో ఓ పక్కనుంచి చావుమేళం వినిపిస్తోంది. శుభమా అని పెళ్లి చేసుకుంటూంటే ఇదేమిటా అని అటే తిరిగాను. సుధీర్‌గాడి ఆధ్వర్యంలో ఓ చావు మేళం వస్తోంది. మొత్తం మీద ఆలస్యంగానైనా నాకు పెళ్లవుతోందని వీళ్లందరికీ కుళ్లు.

ఇవేవీ చాలవన్నట్లుగా, పరాకాష్టగా శేఖర్ ఓ కొజ్జాగుంపును వెంటపెట్టుకుని వచ్చేడు. ''సూడు సిన్నమ్మా, పాడుపిల్లడూ...'' అంటూ వాళ్ళంతా నామీద పడ్డారు. ఇంతంత ఖర్చు పెట్టుకుని అంత దూరం నుండే వాళ్లందర్నీ మొబిలైజ్ చేయగల్గిన మావాళ్ళ నాయకత్వపు లక్షణాలకి నేను ఆనందపడ్డాను. ఈ చిత్రవిచిత్ర విన్యాసాలన్నీ చూసి, నా కాబోయే భార్యావాళ్ళ కుటుంబ సభ్యులూ బెదిరి పారిపోయి వుంటారనుకున్నా. కానీ వాళ్లంతా జంధ్యాలగారి హాస్యభరిత చిత్రాన్ని చూస్తున్నట్లుగా భలే ఎంజాయ్ చేస్తూ ఉన్నారు.

ఇదంతా చూసి మా మావయ్యకి చిర్రెత్తి, కోపంతో పందిరిగుంజను గట్టిగా గుంజేడు. దాంతో కల్యాణమండపం కాస్తా మా నెత్తిన వాలిపోయింది. మావయ్య పందిరిగుంజతో కర్రసాము చేస్తూ, నా ఫ్రెండ్సును అనుమానం వచ్చినవాడినల్లా బాదుకుంటూపోయాడు.

ఈ రకంగా చిత్ర విచిత్ర సంఘటనల సమ్మేళనంగా నా పెళ్లి జరిగిపోయింది. అనుకున్న ముహూర్తానికి రెండుగంటలు ఆలస్యంగా, తాళిబొట్టు స్థానంలో పసుపుకొమ్ము తీసుకుని ఏదో అయ్యిందిలే అన్నట్లు పెళ్లి జరిపించేసేడు మావయ్య.

సిగ్గుపడుతూ, నెమ్మదిగా తల ఎత్తి ఆమె ముఖంలోకి చూసి... ఒక్కసారిగా దడుసుకున్నాను. చందమామ కథల్లోని మాంత్రికురాల్లా ఆమెకు ముందు మూడు పళ్ళూ లేకపోవడంతో.. భయంకరంగా కనిపిస్తోంది. సగం కొరికిన యాపిల్‌పండులో ఆమె మూడుపళ్ళ బ్రిడ్జ్ దిగబడిపోవడంతో, దొంగతనం చేయడంలో అప్రెంటీస్ చేస్తూ ఉన్నవాడు, మొదటి జేబు కొడుతుండగా దొరికిపోతే ఎలా మొహం పెడతాడో, అలా పెట్టింది ఆమె మొహం.

ఇప్పుడు నేను మగవాడిజీవితంలోని అత్యంత కీలకమైన దశలో ప్రవేశించబోతున్నాను. మావయ్య దగ్గరకు వెళ్ళి నెమ్మదిగా చెవిలో ఊదాను. ''ఈ శోభనం కార్యక్రమానికి అంత తొందరేంవచ్చిందీ! నాక్కాస్త ధైర్యం చిక్కేక నేనే ఏర్పాటు చేసుకుంటాలే!' అని. వెంటనే మావయ్య నావంక చాలా అసహ్యంగా చూసేడు. ఇంకా నయం డాక్టరు భ్రమరం ఓ పత్రికలో నిర్వహిస్తున్న శీర్షికకు నేను మారుపేరుతో ఓ ఉత్తరం రాసేననీ, దానికి సమాధానం వచ్చేకనే శోభనం చేసుకుందామనుకున్నాననీ చెప్పాను కాను!

ఏమైతేనేం.. ఆ భయానక క్షణం రానే వచ్చింది. అమ్మవారికి బలి ఇవ్వబోతున్న మేకపిల్లలా వణుక్కుంటూ శోభనపు గదిలోకి అడుగుపెడుతుంటే మావయ్య వచ్చి 'ఒకటి నుండి వంద వరకూ అంకెల్ని మనసులోనే లెక్కపెట్టుకుంటూ ఉండమని చెప్పేడు. 'ఇంతకీ అంకెలు తెలుగులో చదవాల్నా లేక ఇంగ్లీషులోనా?' అని నెమ్మదిగానే అడిగా. ఎందుకోగాని మావయ్యకి చాలా కోపం, అసహ్యం కలిగాయి నామీద.

అంతలో కొంతమంది ఆడవాళ్ళు పెళ్లికూతుర్ని తీసుకొచ్చి ఆ గదిలోకి నెట్టేసి, బయట గడియ పెట్టేసారు. పాపం వాళ్ళకి తెలియదు ఆ గదికి రెండో పక్కన తలుపుందని... నేను పారిపోవడానికి! భల్లూకం బారిన పడ్డట్టుగా నేను ఒణుకుతున్నాను.

ఆమె దగ్గరకు వస్తూ ఉండి. ''ముప్పై రెండు..'' అని నేను పైకి అనేశాను.

ఆమె అనవసరంగా మెలికలు తిరిగిపోతూ '' అబ్బో ఏమిటో అనుకున్నా రసికులే! చూపులతోనే నా బాడీని కొలిచేస్తున్నారే'' అంది.

లోపలి నుండి తన్నుకు వస్తున్న వణుకుని అదుపు చేసుకోవడానికి, నామానాన నేను అంకెలు లెక్కపెట్టుకుంటుంటే, ఈమేంటి..పాతసిన్మాల్లోని ముదరహీరోయిన్లా ఓవరైపోతుందీ అనుకున్నాను.

పాలగ్లాసుకు బదులు ఆమె చేతిలో బాటిల్ ఉంది. ''ఏవండీ..పాలు విరిగిపోవడంతో, అమ్మ ఫ్లేవర్డ్‌మిల్క్ బాటిలిచ్చింది. ఏమనుకోకుండా తాగేయండేం!'' అంది ముద్దుముద్దుగా.

ఆహా! ఏమి నాభాగ్యం! ముందు ముందు మా సంసారం ఎలా ఉంటుందో అన్నదానికి ఓ సింబాలిక్ షాట్‌లా ఉందిది. గబగబా సగం బాటిల్ ఖాళీ చేసేసి, మిగిలిన సగం త్రాగమని ఆమెకిచ్చేను. ఓ గుక్కెడు తాగిందో లేదో 'హాఁఛ్ ' అంటూ తుమ్మింది. ఓహోం ''అన్నీ మంచి శకునములే..'' అనుకున్నా..''నాకు చల్లనివి తాగితే ఇలానే తుమ్ములొస్తాయి. బాబూ!'' అంది సిగ్గుపడుతూ.

''పోన్లే అది ఒదిలేసేయ్..'' అని చెప్పి, టేబుల్ పైనున్న యాపిల్ పండును తీసి ఆమెకిచ్చి ''ఇది లాగించేయ్'' అన్నాను.

ఆమె నోరంతా కప్పులా తెరచి, ఒక చేత్తో యాపిల్‌ని తన నోటికందించుకుంటూ, మరో చేతిని నా జుట్టులోనికి పోనిచ్చి గోముగా అంది. ''నేనెంత అదృష్టవంతురాలినండీ.. మీలాంటి మంచి.. ఆఁ..! బట్టబుర్రా!?''

నాఖర్మకాలి ఆ విగ్గు కాస్తా ఆమె చేతిలోకి వచ్చేయడంతో షాక్ తిని ''ఆఁ..మీది పెట్టుడు జుట్టా?'' అంది వెర్రిగా చూస్తూ.

సిగ్గుపడుతూ, నెమ్మదిగా తల ఎత్తి ఆమె ముఖంలోకి చూసి... ఒక్కసారిగా దడుసుకున్నాను. చందమామ కథల్లోని మాంత్రికురాల్లా ఆమెకు ముందు మూడు పళ్ళూ లేకపోవడంతో.. భయంకరంగా కనిపిస్తోంది. సగం కొరికిన యాపిల్ పండులో ఆమె మూడుపళ్ళ బ్రిడ్జ్ దిగబడిపోవడంతో, దొంగతనం చేయడంలో అప్రెంటీస్ చేస్తూ ఉన్నవాడు, మొదటి జేబు కొడుతుండగా దొరికిపోతే ఎలా మొహం పెడతాడో, అలా పెట్టింది ఆమె మొహం.

''హేఁ.. నీవి కట్టుడుపళ్ళా..'' అన్నాను. ఇలా జరిగినందుకు నాకు బాధ కంటే, కించిత్తు ఆనందంగానే అనిపించింది. టిట్ ఫర్ టాట్‌లా బాగానే అయింది అమ్మడికి అని.

గబగబా వెళ్ళి లైటు తీసేసాను.

''అబ్బా.. మీకెంత తొందరో..'' అంటూ గారాబం పోతోంది. పళ్ళూడిన పార్వతి.

వెంటనే నేను తేరుకుని ''ఛ..మరీ ఎక్కువగా ఫీలైపోకు. లైటు ఉంటే.. ఇంకెలాంటి సీన్లు చూడాల్సి వస్తోందోనని భయపడి.... ఇలా..'' అని నీళ్ళు నమిలాను.

★